నారాయణ కాలేజీను తక్షణమే సీజ్ చేయాలి: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ముచ్చకర్ల వంశీ మృతికి కారణమైన నారాయణ కాలేజీని తక్షణమే సీజ్ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి వియ్యపురాజు డిమాండ్ చేశారు. బుధవారం కాలేజీ వద్ద భారీ సంఖ్యలో విద్యార్థులతో నిరసన చేపట్టి మాట్లాడారు. ఈనెల 12వ తేదీ మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఇంటికి వెళ్లిన వంశీ రాత్రి చూసేటప్పటికి చనిపోయి ఉండడంతో ఏం జరిగిందో తెలియని ఆందోళనలో తల్లిదండ్రులు ఉన్నారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకే కాలేజ్ నుంచి వంశీ బయటికి వెళ్లిపోయినా కాలేజీ యాజమాన్యం పట్టించుకోలేదని, యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల ఒక నిండు ప్రాణం బలైపోయిందని అన్నారు. చనిపోయి రెండు రోజులు గడుస్తున్నా సమాచారం ఉన్నప్పటికీ కనీసం చూడడానికి కూడా వెళ్లలేని నారాయణ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. పత్రికల్లో సమాచారంతో కాలేజీకి వచ్చిన డీఈవోని ఏం జరిగిందని అడగగా పరీక్ష సమయంలో స్లిప్పులు పెట్టి కాపీ కొట్టడంతో మందలించామని కాలేజీ యాజమాన్యం చెప్పుకొచ్చారని అన్నారు. వంశీ మృతి పట్ల ప్రత్యేకమైన కమిటీ వేసి న్యాయవిచారణ జరిపించాలని అన్నారు. యాజమాన్యం, తల్లిదండ్రుల మధ్య వారధిగా పనిచేసిన పోలీసులు ఆదివారానికి సెటిల్మెంట్ వాయిదా పడిందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

సిఫార్సులకే పెద్దపీట...!

15 రోజుల్లో మళ్ళీ పలువురు జోనల్ కమిషనర్ల మార్పులు..

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జీవీఎంసీలో జోనల్ కమిషనర్ల పనితీరు మరింత ప్రాధాన్యం కానుంది. ఈ నేపథ్యంలో రాజకీయ నేతల సిఫార్సులతోనే జీవీఎంసీలో మళ్ళీ జోన్ల కమిషనర్ల అంతర్గత బదిలీలు చోటుచేసుకున్నాయని ప్రచారం సాగుతుంది. గత 15 రోజుల క్రితమే రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బదిలీలపై వచ్చిన వారందరికీ వివిధ జోన్లకు జోనల్ కమిషనర్లుగా నియమించిన జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ తాజాగా ముగ్గురు జోన్ల కమిషనర్లను వివిధ జోన్లకు మార్పులు చేస్తూ మళ్ళీ బుధవారం ఉత్తర్వులు వెల్లడించారు. భీమిలి నియోజకవర్గంలో జోనల్ కమిషనర్గా కె.కనకమహాలక్ష్మి పాత్ర కీలకం కావడంతో మళ్లీ ఆమెను అదే నియో జకవర్గంలో జోన్ మార్చి డిపివో నుండి జోనల్ కమిషనర్గా నియమించుకునేలా ఆ నియోజకవర్గ నేత చక్రం తిప్పారని ప్రచారం సాగుతుంది. ఇక జోన్ 2 మధురవాడలో ఇటీవలే జోనల్ కమిషనర్గా డి.లక్ష్మిని నియమించినప్పటికీ పరిపాలన బాధ్యతలు నుండి కనక మహాలక్ష్మిని తప్పించలేదు. తాజా ఉత్తర్వుల్లో డి.లక్ష్మిని పూర్తిగా జోనల్ కమిషనర్ నుండి తప్పించి మళ్లీ యూసీడీ పీఓగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. జోన్ 2 మధురవాడ జోనల్ కమిషనర్గా భీమిలి జోన్1లో పనిచేస్తున్న శైలజ వల్లిని నియ మించారు. ఆ నియోజకవర్గంలో వారిద్దరిని జోన్లు అటు ఇటుగా మార్పు చేసి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఇక జోన్ 3 ఆశీల్మెట్టలో జె.విజయలక్ష్మిని యధాతధంగా జోనల్ కమిషనర్గా కొనసాగించారు. జోన్ 4 సూర్య భాగ్ జోనల్ కమిషనర్గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బి.సన్యా సినాయుడను మళ్లీ గాజువాక జోన్ 6 జోనల్ కమిషనర్గా నియమించారు. అక్కడ పనిచేస్తున్న జోనల్ కమిషనర్ పీవీవీడీ ప్రసాద్ రావును సన్యాసినాయుడు స్థానంలో జోన్ 4 జోనల్ కమిషనర్గా నియమించారు. జోన్ 5 జోనల్ కమిషనర్ ఆర్జీవీకే కృష్ణను యధాతధంగా ఆ జోన్లోనే కొనసాగించారు. జోన్ 7 అనకాపల్లి జోనల్ కమిషనర్గా నాయుడును కొనసాగించారు. జోన్ 8 పెందుర్తి జోనల్ కమిషనర్గా కే హైమావతిని కూడా కొనసాగించారు.

16న దేశ వ్యాప్త బంద్ను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - చోడవరం: ఈ నెల 16న దేశ వ్యాప్తంగా గ్రామీణ కార్మికుల భారత బంద్ను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు కోరారు. చోడవరంలో బుధవారం నిర్వహించిన కార్మికుల సమావేశంలో రెడ్డిపల్లి మాట్లాడుతూ ఢిల్లీలో రైతులు సంవత్సర కాలం పాటు దీక్షలు చేసి నల్ల చట్టాల్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ప్రభుత్వం మెడలు వంచి, చేసిన పోరాటం నేటికీ కూడా అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఎం.ఎస్. స్వామినాథన్ కమిషన్ సీటు ప్లస్ 50 అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్ రద్దు చేయాలని, రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేయాలని, ఎరువులు పురుగు మందులు విత్తనాలు సబ్సిడీ మీద ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సూరిశెట్టి జాన్, నారాయణరావు, రంగనాథం, శ్రీను, రైతు సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ కృష్ణుని ఆలయం ప్రారంభం

విశాలాంధ్ర - కే.కోటపాడు: మండలంలోని సింగన్న దొరపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణుని ఆలయ ప్రారంభోత్సవానికి పలువురు టీడీపీ నాయకులు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామా నాయుడు, మాడుగుల నియోజకవర్గం ఇన్చార్జ్ పివిజి కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఆలయ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి పదివేల రూపా యలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం గుడి ఆవరణలో ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే ఆర్లే గ్రామంలో శ్రీ సీతారాముల తీర్థ మహోత్సవ కార్యక్రమానికి పైలా ప్రసాదరావు హాజరై స్థానిక నాయకులతో కలిసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పూడి నారాయణమూర్తి, వెలగల పైడం నాయుడు, మాజీ ఎంపీటీసీ పిల్లల రమణ, జామి రమణేశ్వరరావు, పిల్లల దేవుడి బాబు, పిల్లల మహాలక్ష్మి, బండారు నరసింహనాయుడు, గోకాడ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన అనిత

విశాలాంధ్ర - పాయకరావుపేట: పట్టణంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత పరామర్శించారు. మల్లవరపు రవి అనారోగ్యంతోను, సలికే రాజ్ కుమార్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షులు పెదిరెడ్డి శ్రీను, మల్లపురెడ్డి రమాకుమారి, కట్ట శ్రీను, కసింకోట సత్తిబాబు, చిరుకూరి పేర్రాజు, కుందూరు కుమార్, గంపల చినరాజు, బోడపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్లో సత్తా చాటిన గిరిజన బాలికలు

విశాలాంధ్ర - చింతపల్లి: జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్ పరీక్షల్లో మండలానికి చెందిన గిరిజన బాలికలు కొట్టికి దీపిక, సెగ్గె తేజస్విలు సత్తా చాటారు. ఇరువురు విద్యార్థినిలు మధురవాడ సమీపంలోని మారిక వలస గిరిజన గురుకుల బాలికల ప్రతిభ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. జనవరిలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ పరీక్షలకు హాజరైన వీరు ఆ పరీక్షలలో తమ సత్తా చూపారు. చింతపల్లి మండలం కొత్తపాలెం పంచాయతీ పరిధి లోని భీమసింగి గ్రామానికి చెందిన సెగ్గె తేజస్విని 89.24, అన్నవరం పంచాయతీ పరిధిలోని పనసల పాడు గ్రామానికి చెందిన కొట్టికి దీపిక 86.42లు ఉత్తీర్ణత పొంది మెయిన్స్కు ఎంపిక య్యారు. దీంతో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు కుటుంబ సభ్యులు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.

అల్లూరి జిల్లా కలెక్టర్గా విజయ సునీత

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: రాష్ట్రంలోని పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీలలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ గా ఎం.విజయ సునీతను నియమించారు. ఇప్పటివరకు కలెక్టర్గా పని చేసిన సుమిత్ కుమార్ను పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్గా బదిలీ చేశారు. విజయ సునీత ఇప్పటివరకు మహిళా భివృద్ధి శిశు సం క్షేమ శాఖ డైరెక్టర్గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన

విశాలాంధ్ర - ఎలమంచిలి రూరల్: ఎలమంచిలి రైల్వే గేట్ వద్ద ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే ఉప్పలపాటి వెంకట రమణమూర్తి రాజు (కన్నబాబు) పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు నిర్మాణ పనుల తీరును పరిశీలించి పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సుదీర్ఘకాలంగా పట్టణ వాసుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న రైల్వే గేటు సమస్య త్వరలో తీరబోతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ సుకుమార వర్మ, ఎలమంచిలి ఎంపీపీ గోవిందు, బెజవాడ నాగేశ్వర రావు, ఇతర నాయకులు, ఆర్ అండ్ బీ అధికారులు పాల్గొన్నారు.

16న పారిశ్రామిక సమ్మెలో పాల్గొనండి

అఖిలపక్ష కార్మిక సంఘాల బైక్ ర్యాలీ

విశాలాంధ్ర - విశాఖ: నరేంద్రమోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్ను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నుండి ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏపీఎఫ్టీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్జె అచ్యుతరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం రైతులకు, కార్మికులకు నష్టదాయకమైన చట్టాలను చేసిందన్నారు. వ్యవసా యరంగాన్ని, ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలపరం చేయడానికి పూనుకుందన్నారు. స్టీల్ప్లాంట్ పరిరక్షణ ఉద్యమం మూడేళ్ళ నుండి జరుగుతున్నా మోడీ ప్లాంట్ని అమ్మితీరుతామని బరితెగించి చెబుతుందన్నారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం తారా స్థాయికి చేరాయన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 16న దేశ వ్యాప్తంగా కార్మికవర్గం, రైతు, వ్యవసాయ కార్మికులంతా పెద్దఎత్తున పోరాటానికి సిద్ధమయ్యారని తెలిపారు. 16వ తేదీన సరస్వతీ పార్క్ నుండి జరుగే కార్మిక ప్రదర్శనలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షులు ఎం.మన్మధరావు, ఏపీఎఫ్టీయూ నాయకులు దేవా, నాయకులు పి.మణి, ఉరుకూటి రాజు, వి.కృష్ణారావు, రెహమాన్, పడాల రమణ, వై.రాజు, బి.వెంకటరావు, చంద్రశేఖర్, యు.ఎస్. ఎన్.రాజు, టి.నూకరాజు, కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల గృహ నిర్బంధం దుర్మార్గం

సీపీఐ జోనల్ కార్యదర్శి భద్రం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: విజయవాడలో జరిగే అగ్రిగోల్డ్ బాధితుల పోరాట దీక్షకు వెళ్లకుండా అగ్రిగోల్డ్ బాధితులను ఎక్కడికి అక్కడ గృహ నిర్బంధం చేయడం దుర్మార్గమని సీపీఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం తీవ్రంగా మండిపడ్డారు. జగన్ ప్రభుత్వం అధికారం చేపట్టిన 10 రోజులు 20,000 లోపు ఆరు నెలలు లోపల మొత్తం డిపాజిట్ దారులందరికీ సొమ్ము తిరిగి చెల్లిస్తామని నమ్మబలికి ఐదేళ్లు కావస్తున్నా ఒక రూపాయి కూడా చెల్లించకపోవడం అన్యాయం అన్నారు. చనిపోయిన బాధిత కుటుంబాలకు 10 లక్షలు పువ్వుల్లో పెట్టి ఇస్తానని ప్రకటించిన ముఖ్యమంత్రికి పువ్వులు దొరకలేదా? డబ్బులు లేవా తెలియడం లేదన్నారు. జగన్ రెడ్డి మోసం చేయడం వల్ల అగ్రిగోల్డ్ బాధితులు ఆత్మహత్యలకు, బలవన్మరణాలకు పాల్పడే అవకాశం ఉందని, ఇవి ప్రభుత్వ హత్యలుగానే పరిగణించాల్సి వస్తుందన్నారు. పోలీసులతో ఎన్ని అడ్డంకులు పెట్టినా 15న జరిగే పోరాట దీక్ష జరిగి తీరుతుంది అన్నారు. బాధితులు చావో రేవో తేల్చుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అగ్రిగోల్డ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కర్ణం మాణిక్యాలరావును అర్ధరాత్రి 11 గంటలకు పోలీసులు గృహనిర్బంధం చేశారు.

పెదపాటి అమ్మాజీకే వైసీపీ టికెట్ ఇవ్వాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: స్థానిక నాయకురాలైన ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజీకే వైసీపీ తరుపున టికెట్ ఇవ్వాలని వైసీపీ పార్టీకి చెందిన దళిత నాయకులు నెలపర్తి అర్జున్ డిమాండ్ చేశారు. పాయకరావుపేటలో జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్ వద్ద స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా స్థానికులకే టిక్కెట్లు కేటాయించాలని అన్ని పార్టీలను కోరుతున్నట్లు తెలిపారు. పార్టీలు పెడచెవిన పెట్టాయని వాపో యారు. దళితులు జెండాలు మోయడానికి తప్ప దేనికి పనికి రారని అగ్రకులాల నాయకులు భావిస్తు న్నారని తెలిపారు. స్థానికంగా ఉంటూ, నాలుగు మండలాల్లో తిరుగుతూ, ప్రభుత్వ పథకాలు ప్రజ లకు తెలియజేస్తూ, అందుబాటులో ఉంటున్న పెదపాటి అమ్మాజికి టికెట్ కేటాయిస్తే అఖండ మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు. స్థానికేతరులకు టికెట్ ఇవ్వడం వలన గెలిచిన తరువాత ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, ఓడిపోతే సూట్ కేస్ సర్దుకుని వెళ్ళిపోతున్నారని అన్నారు. వైసీపీ ఇన్చార్జ్గా నియమించిన కంబాల జోగులు నేటికీ దళితులను కలవలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ముక్కుడుపల్లి దాసు, తాటిపాక లోవరాజు, పల్లా ప్రసాద్, గారా చంటి, మారెళ్ళ దుర్గాప్రసాద్, దండా లోవ రాజు, గంపల బుల్లబ్బాయి, ఏనుగుపల్లి శ్రీను, పీతల ప్రసాద్, పెదపాటి నూకరాజు పాల్గొన్నారు.

ఏజెన్సీలో వైద్య సేవలపై దృష్టిపెట్టాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: గ్రామీణ ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సేవలు సరిగా ఉండటం లేదని వైద్యులు అందుబాటులో ఉండటం లేదని జిల్లా సర్వసభ్య సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్మన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన బుధవారం ఉమ్మడి విశాఖ జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. సభ్యులు వైద్యారోగ్య శాఖ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. చిన్న సమస్య వచ్చినా కేజీహెచ్కి పంపించేస్తున్నారని, అత్యవసర సమయంలో వైద్యులు అందుబాటులో ఉండటం లేదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో బాధిత రోగులను ఎస్.కోట లేదా విజయనగరం తీసుకెళ్తున్నారని, అత్యవసర వైద్య సేవలకు కేజీహెచ్కు తరలించాలని కోరారు. అదేవిధంగా ఆర్డబ్ల్యూఎస్ పూర్తిగా విఫలమైందని ఏ పనులు జరగడం లేదని సభ్యులు విరుచుకు పడ్డారు. చైర్ పర్సన్ సుభద్ర కూడా ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు పనితీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. జలజీవన్ మిషన్లో భాగంగా చేపట్టిన పనులు సజావుగా నిర్వహించాలని, సత్ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగ అధికారులను ఆదేశించారు. రైట్ ఎడ్యుకేషన్ ప్రకారం 21 శాతం సీట్లు పేదల పిల్లలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని, దీనిపై విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కర్ణం ధర్మశ్రీ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా పరిషత్ సీఈవో ఎం.పోలినాయుడు, అనకాపల్లి జిల్లా డీఆర్వో దయానిధి పాల్గొన్నారు.

ప్రపంచ దేశాల ప్రగతికి మానసిక శాస్త్రం దోహదం

విశాలాంధ్ర - మధురవాడ: ప్రపంచ దేశాల ప్రగతికి మానసిక శాస్త్రం దోహదపడుతోందని దీని ప్రాధాన్యతను యునెస్కో సహితం గుర్తించిందని ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ సైకలాజికల్ సైన్స్ (ఐయుపిఎస్) సెక్రటరి జనరల్ అవా డి.థామ్సన్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం వేదికగా జరుగుతున్న నేషనల్ అకాడమి ఆఫ్ సైకాలజీ (ఎన్.ఎ.పి) 33వ వార్షిక సమావేశాలను ఆమె బుధవారం ప్రారంభిం చారు. మానసిక శాస్త్రంలో నూతన అంశాలను చేర్చడానికి వివిధ దేశాలలోని మానసిక శాస్త్ర పరిశోధకులను ఒకే వేదికపై తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధిలో మానసిక శాస్త్రం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. గీతం విశ్వవిద్యాలయంలో అంతర్విభాగ పరిశోధనలను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నేషనల్ అకాడమి ఆఫ్ సైకాలజీ అధ్యక్షులు ప్రొఫెసర్ నీనా కొహ్లి, గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ కామయ్య బండి, నేషనల్ అకాడమి ఆఫ్ సైకాలజీ నూతన అధ్యక్షుడు ఎన్.త్రిపాఠి, అప్లైడ్ సైకాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, సమావేశాల కన్వీనర్ డాక్టర్ డి.రవిశంకర్ పాల్గొన్నారు.

భూ హక్కు చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: గాజువాక బార్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 60 రోజులకు చేరుకున్నాయి. న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరానికి సీపీఐ గాజువాక నియోజకవర్గం కార్యదర్శి కసిరెడ్డి సత్యనారా యణ, అఖిల భారత యువజన సమైక్య జిల్లా అధ్యక్షులు కెంగువ అచ్యుతరావు సంఘీభావం తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ హక్కు చట్టం 2023 తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం తీసుకొచ్చినటు వంటి భూ హక్కు చట్టం ఏ రాష్ట్రంలో అమలు చేయక పోయినా ఆంధ్రప్రదేశ్లో మాత్రం జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలగ రెడ్డి పుల్లయ్య నాయుడు, ఎం.నరేంద్ర, ఎం.దివ్య, ఎం.దేవుడు, తదితరులు పాల్గొన్నారు.

రీసెర్చ్ స్కాలర్స్ హాస్టల్ మెస్ని పరిశీలించిన రిజిస్ట్రార్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం రీసెర్చ్ స్కాలర్స్ మెస్ను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ బుధవారం సందర్శించారు. మధ్యాహ్న భోజన సమయంలో ఆకస్మికంగా మెస్ తనిఖీ చేసి పరిశోధకులతో మాట్లాడారు. భోజన నాణ్యత ప్రత్యక్షంగా వారిని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలు, కిచెన్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. హాస్టల్ మెస్లలో సిబ్బంది క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలన్నారు. హాస్టల్ వార్డెన్లు, చీఫ్ వార్డెన్లు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ విద్యార్థులకు భోజన సదుపాయాలను పర్యవేక్షించాలని సూచించారు. రిజిస్ట్రార్ వెంట చీఫ్ వార్డెన్ ఆచార్య బి.మునిస్వామి, ఆచార్య జి.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్తోనే గిరిజనాభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర - దుంబ్రిగుడ: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కుమారిని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన ఇందిరమ్మ పథకం, ఉపాధి హామీ పథకం, అటవీ హక్కుల పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంతోనే గిరిజన ప్రాంతంలో అధికారం జరిగిందని ఇప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో జగన్నాథం చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కే.రాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

పుల్వామా అమరవీరులకు నివాళి

విశాలాంధ్ర - ఎలమంచిలి: పుల్వామా అమరవీరులకు బుధవారం తైక్వాండో క్రీడాకారులు నివాళులర్పించారు. ఎలమంచిలి సత్య స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో క్రీడాకారులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల అమర జవాన్ల ఆత్మకు శాంతి కలగాలని శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో అకాడమీ ఫౌండర్ నగి రెడ్డి సత్యనారాయణ, అకాడమీ కోచ్ భవాని, లహరి, తైక్వాండో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని చందక పంచాయతీకి చెందిన దొంతల లక్ష్మణ గత కొంతకాలంగా గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నారు. ఆపరేషన్ నిమిత్తం వారికి వైద్య ఖర్చులు అవసరం కాగా స్థానిక సర్పంచ్ బంక శ్రీనివాసరావుకు పరిస్థితి చెప్పారు. వెనువెంటనే ఆయన స్పందించి స్థానిక ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఇందుకు స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫార్సు చేశారు. రెండు లక్షల రూపాయలు రిలీఫ్ ఫండ్ను మంజూరు చేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఎమ్మెల్యే అవంతి చేతుల మీదగా బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుషిడి వెంకటరమణ, సహకార సంఘం డైరెక్టర్ లోలుగు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - అచ్యుతాపురం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో ఎంపీపీ కోన సంధ్య బుజ్జి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

శ్రీవిజ్ఞాన్ హైస్కూల్లో సామూహిక అక్షరాభ్యాసం



విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల జువ్వాదిగెడ్డ జంక్షన్లో గల శ్రీవిజ్ఞాన్ పాఠశాలలో బుధవారం సరస్వతిదేవి పుట్టిన రోజు వసంత పంచమి పర్వదినాన పాఠశాల ప్రిన్సిపాల్ పైలా కొండలరావు ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసాలు ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలు జరుగుపల్లి అప్పమ్మశాస్త్రి ఆధ్వర్యంలో జరిగాయి. పూజా సామగ్రిని పాఠశాల యాజమాన్యం అక్షరాభ్యాసంలో పాల్గొన్న వారికి ఉచితంగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.ప్రసాద్, ఉపాధ్యాయ ఉపాధ్యాయునీలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

థింక్ బిగ్ గ్లోబల్తో గొన్న కళాశాల ఒప్పందం



విశాలాంధ్ర - పరవాడ: విద్యార్థులకు డెవలప్మెంట్, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ వంటి సేవలు అందించేందుకు థింక్ బిగ్ గ్లోబల్ సంస్థతో గొన్నా కళాశాల యాజమాన్యం అంగీకార ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఇరువురూ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ గురించి అవగాహన కల్పిం చేందుకు థింక్ బిగ్ గ్లోబల్ సంస్థ సీఈవో మనోజ్ అడ్డకి విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. కళాశాల సెక్రటరీ గొన్న హేమచంద్ నాయుడు మాట్లాడుతూ థింక్ బిగ్ గ్లోబల్ సంస్థతో ఒప్పందం కుదరడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బోనం వీర్రాజుకు సంఘ మిత్ర జాతీయ పురస్కారం



విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: సీనియర్ పాత్రికేయుడు, చైతన్య చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ బోనం వీర్రాజు అలియాస్ పెదబాబుకు సంఘ మిత్ర జాతీయ పురస్కారం లభించింది. ఇటీవల జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈయనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు సతీమణి నందమూరి లక్ష్మీపార్వతి చేతుల మీదుగా విజయవాడలో పురస్కారాన్ని అందుకున్నారు. సామాజిక సేవ చేసినందుకు గాను వీర్రాజుకు ఈ గుర్తింపు దక్కింది. ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రోత్సాహంతో ఈయన ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఉత్తరాంధ్రలో ఈ అవార్డుకు ఇద్దరు ఎంపిక కాగా వారిలో వీర్రాజు ఒకరు. మరో వ్యక్తి ముంచింగిపుట్టు మండలం సుజన కోట గ్రామానికి చెందిన జి.కె.బాబుగా ఉన్నారు. వీర్రాజు మారుమూల ఏజెన్సీ మండలం ముంచంగిపుట్టు కేంద్రంగా గత ఇరవై ఆరేళ్లుగా పాత్రికేయునిగా సేవలందిస్తున్నారు. ఆంధ్ర ప్రభ, ఇండియన్ ఎక్స్ప్రెస్, విశాఖ సమాచారం పత్రికల్లో పనిచేసిన వీర్రాజు స్థానికులకు పెదబాబుగా సుపరిచితులు. రచయిత, నాటక రంగంలో కూడా విభిన్న పాత్రలల్లో రాణించి స్థానికంగా చెరగని ముద్ర వేసుకున్నారు. 'చతుర్విద'తో సామాజిక స్పృహ' స్వతహాగా రచయిత కూడా అయిన వీర్రాజు తమ మిత్ర బృందంతో పయనించి గిరిపుత్రుల్లో సామాజిక స్పృహను తీసుకురావడానికి తన వంతు కృషి చేశారు. ప్రధానంగా ఆనాటి స్నేహితుడు డాక్టర్ విద్యాధర శివాజీ రాజుతో కలిసి వివిధ అంశాలతో కూడిన నాలుగు కథనాలను రాశారు. అప్పటి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు పి.రామకృష్ణ, కే.వికాస్ రాజ్ చొరవతో ఐటీడీఏలో ఏజెన్సీ పదకొండు మండలాలలో 400 మంది యువతీ యువకులకు శిక్షణ ఇప్పించి కళాకారులుగా మండలానికి రెండు టీములు ఏర్పాటు చేసి నాటిక వంటి ప్రదర్శనలతో విద్య, వైద్యం, పర్యావరణం, మద్య పానం వంటి కీలక అంశాలపై అవగాహన పరిచారు. మంచిని ఆదరించండి - మద్యాన్ని వీడనాడండి అన్న నినాదంతో పాడేరు కేంద్రంగా చైతన్య చారిటబుల్ ట్రస్ట్ను నెలకొల్పారు. పెనుబాక రవికుమార్ చైర్మన్గా వీర్రాజు డైరెక్టర్గా 19 ఏళ్లగా సంస్థ తమ కార్యకలాపాలను కొనసాగిస్తుండం గమనార్హం. వీర్రాజు రచనలు నాటికీకరణ శైలి అప్పట్లో అధికారులను సైతం మంత్రి ముగ్ధుల్ని చేస్తూ విశేషంగా ఆకట్టుకుంది. జాతీయ పురస్కారం సంఘమిత్ర రావడంతో మండల నాయకులు, ప్రజలు, తోటి విలేకరుల మిత్రులు అభినందిస్తున్నారు.

సెయింట్ ఆన్స్ ఎన్ఎస్ఎస్ విభాగానికి అభినందనలు



విశాలాంధ్ర - మల్కాపురం: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి లోని బోర్డు ఆఫ్ కమ్యూనిటీ డెవలప్మెంట్ త్రూ ఎడ్యుకేషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన లెర్నింగ్ ఇంప్రూ వ్మెంట్ ప్రోగ్రాంపై గుంటూరులోని కె.ఎల్. యూనివర్సిటీలో ఈనెల 12, 13వ తేదీల్లో మాస్టర్ రిసోర్స్ పర్సన్స్కు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి సెయింట్ ఆన్స్ కళాశాల నుండి జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయా దేవి పాల్గొన్నారు. వీరితోపాటుగా జాతీయ సేవా పథక వాలంటీర్ జి.హర్షితారాణి పంజాబ్లోని రాజపురాలో గల చిత్కార యూనివర్సిటీలో 5వ తేదీ నుండి 11వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొంది. అందుకు గాను యాజమాన్యం అధ్యాపకులతో బాటు ఘనంగా హర్షిత రాణిని కూడా సత్కరించింది. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్ల, సుపీరియల్ సిస్టర్స్ జయశీల, జానిస్ పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలో రాత్రికి రాత్రి రేకుల షెడ్డు నిర్మాణం

విశాలాంధ్ర - రావికమతం: రావికమతం మండలం జెడ్.కొత్తపట్నం గ్రామ కంతం స్థలంలో స్థానిక పాల డైరీ సమీపంలో రాత్రికి రాత్రి రేకుల షెడ్డు నిర్మాణం చేయడంతో రెండు వర్గాల మధ్య నెలకొన్న తగాదా మరింత తారాస్థాయికి చేరింది. గ్రామ కంతంలో సర్వే నెంబర్ 75/1లో గ్రామానికి చెందిన గొల్లి తమ్ము నాయుడు 0.04 సెంట్లు స్థలాన్ని కొనుగోలు చేసుకోగా దొండపూడి రెవెన్యూ పరిధిలో సర్వే 2/1 లో ఇదే గ్రామానికి చెందిన లాలం అప్పలనాయుడు కొంత స్థలం కొనుగోలు చేశారు. ఇరు వర్గాల మధ్య గత కొంత కాలంగా స్థలంపై గొడవలు పడుతుండటంతో పాటు ఇరు వర్గాలు నర్సీపట్నం ఆర్‌డీఓ కోర్టులో కేసులు వేసుకున్నారు. ఈ సమస్యపై మార్చి 2 న నర్సీపట్నం ఆర్‌డీఓ కోర్టుకు ఇరు వర్గాలను హాజరు కావాలని నోటీస్ జారీ చేశారు. అయితే నోటీస్‌పై స్థానిక వీఆర్వో రాజేష్‌కు అవగాహన లేక పోవడంతో ఈ సమస్య మరింత జటిలంగా మారింది. లాలం అప్పలనాయు దుదే స్థలం అంటూ ఆర్డర్ వచ్చాయని వీఆర్వో రాజేష్ చెప్పడంతో అప్పలనా యుదు కుటుంబం రాత్రికి రాత్రి తగాదా స్థలంలో రేకుల షెడ్డు నిర్మాణం చేశారు. దీనిపై తమ్ముడు నాయుడు కొత్తకోట పోలీసులను ఆశ్రయించగా వీఆర్వో పోలీసులను కూడా తప్పు తోవ పట్టించారని తమ్ముడు నాయుడు ఆరోపించారు. స్థలంలో ఎటువంటి ఇల్లు లేకపోయినా ఇల్లు, కరెంట్, తాగునీటి కొళాయి, ఇతర మౌలిక సదుపాయాలు ఉన్నట్టు అధికారులను మోసం చేస్తూన్నారన్నారు. ఎవ్వరైనా ప్రశ్నిస్తే మహిళలతో పోలీసులకు తప్పుడు కేసులు పెడుతూ భయ భ్రాంతులు చేస్తూన్నారని తమ్మునాయుడు వాపోయారు. ఈ సమస్యపై వీఆర్వో రాజేష్‌ను వివరణ కోరగా అప్పలనాయుడు నిర్మించిన రేకుల షెడ్డును తొలగిస్తామన్నారు. ఆర్‌డిఓ జారీ చేసిన నోటీస్‌పై అవగాహన లేక ప్రిమినరీ ఆర్డర్‌ను తప్పుగా అర్థం చేసుకున్నామని చెప్పారు. షెడ్డును తొలగించడంతో పాటు స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.

ఇసుక యార్డ్‌లో ఇంటి దొంగలు

- కాంట్రాక్టర్ కంట్లో ఇసుక
- తూనికల్లో మోసం
- సంఘం పేరుతో దోపిడి

విశాలాంధ్ర - పరవాడ: అగనంపూడి ఇసుక స్టాక్ యార్డ్‌లో ఇంటి దొంగలు ఇసుకను దోచేసి సొమ్ము చేసుకుంటున్నారు. తూనికల్లో పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడుతూ కాంట్రాక్టర్ కంట్లో ఇసుక కొడుతున్నారు. బయట లారీలను అడ్డుకొని యూనియన్ల పేరుతో లారీ యాజమానులు దళారీల సహాయంతో దందా సాగిస్తున్నారు. ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వానికి మరొక వైపు కాంట్రాక్టర్‌కు నష్టాన్ని తెస్తూ దళారీలు, లారీల యాజమానులు ఏకమై ఇసుకను పక్కదారి పట్టిస్తూ దోచేస్తున్నారు. మైన్స్ అండ్ జియాలజీ విజిలెన్స్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, రెవెన్యూ అధికారులు ప్రభుత్వ అవసరాలకు ఇసుక సరఫరా అవుతుందన్న అనందంలో అక్రమార్కులకు రాజబాటలు వేస్తున్నారు. ఒకటో రెండో కేసులు నమోదు చేసినప్పటకీ అక్రమార్కులను అరికట్టలేక పోతున్నారు. కేవలం రెండు నెలల్లో ఎన్నికలు రానున్న తరుణంలో చక్కబెట్టేందుకు లారీల యాజమానులు దళారీలతో కలిసి చక్రం తిప్పుతున్నారు. ఇక్కడ కూడా లంకెలపాలెం, ఇ.మర్రిపాలెం గ్రామాలకు చెందిన లారీల యాజమానులు సంఘాలు ఏర్పాటు చేసి ఇసుక సరఫరాను తమ చెప్పుచేతల్లో పెట్టుకుంటున్నారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. నిజానికి ఇసుక నిల్వ కేంద్రం అగనంపూడి రెవెన్యూ పరిధిలో ఉంది. ఇది గాజువాక మండలం విశాఖ జిల్లాకు చెందింది. అయితే ఇక్కడ చక్రం తిప్పేవారంతా అనకాపల్లి జిల్లా పరవాడ మండలానికి చెందినవారు కావడం విశేషం. అగనంపూడి నుంచి వచ్చే స్థానిక లారీలను సయితం ఇక్కడి వారు బెదిరింపులకు పాల్పడుతున్నారన్న ఆరో పణలు విన్పిస్తున్నాయి. తొలుత గనులు, భూగర్భశాఖ అధికారుల పర్యవేక్షణలో ప్రభుత్వం ఇక్కడ ఇసుక యార్డ్‌ను ఏర్పాటు చేసింది. కొద్ది కాలం పాటు ప్రభుత్వరంగంలో కొనసాగిన ఈ ఇసుక నిల్వ సరఫరా కేంద్రం ఆ తర్వాత ప్రవేటు పరం కావడంతో ఇక్కడ ఇ.మర్రిపాలెం, లంకెల పాలెంనకు చెందిన యాజ మానులు చక్రం తిప్పుతున్నారు. ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు, ఇతర ప్రభుత్వ రంగ నిర్మాణ అవసరాల కోసం ఇసుక యార్డ్‌ను ఏర్పాటు చేసింది. ఆధార్ కార్డు అధారంగా అవసరమైనవారు ఆన్‌లైన్ ద్వారా ఇసుకను బుక్‌చేసుకుంటే ఇక్కడి నుంచి ప్రభుత్వం నిర్దేశించిన ధరకు ఇసుకను సరఫరా చేస్తారు. అయితే అగనంపూడి విశాఖ నగరం, పరవాడ పారిశ్రామిక ప్రాంతానికి అతి చేరువులో ఉండటంతో ఇక్కడ ఇసుకకు మంచి గిరాకీ ఉంది. దీన్ని ఆసరాగా చేసుకున్న కొంతమంది లారీల యాజమానులు తూనిక యంత్రాల యాజమానులు, ఇసుక యార్డ్ సిబ్బందితో కుమ్మక్కై ఇసుకను పక్కదారి పట్టిస్తున్నారు. ఇటీవల మైన్స్‌అండ్ జియాలజీ విజిలెన్స్ అధికారులు లారీలను పట్టుకొని 82వేల రూపాయలు వరకూ జరిమానాలు విధించారు. అలాగే పరవాడ రెవెన్యూ అధికారులు సైతం అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలపై నిఘా పెట్టారు. ఇసుక యార్డ్ వద్ద తూనిక యంత్రం లేక పోవడంతో లంకెల పాలెంలోని ఒక తూనిక యంత్రం వద్ద వేయింగ్ చేయి ంచుకొని వే బిల్లును సిద్ధం చేయిస్తున్నారు. ఇక్కడ ఇసుక దారి మళ్లుతుంది. 20మెట్రిక్ టన్నుల ఇసుక లోడింగ్ అయితే 10టన్నులుగా వేబిల్లు నమోదు చేస్తున్నారు. అలాగే ఏడాది క్రితం బిల్లులను సైతం చలామనీ చేస్తూ లారీల యాజమానులు ఇసుక అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం ఇసుక తరలింపుపై గట్టి నిఘా పెడ్తున్నట్టు చెబుతున్నా పట్టించుకునే నాధుడే కరవయ్యాడు. పేదల పేరుతో ఇసుకను బుక్ చేసి పక్కదారి పట్టిస్తున్నా పట్టించుకునే వారే లేరు. ప్రభుత్వ అవసరాల కోసం అనుకుని విడిచి పెడ్తుండటం దళారీలకు బాగా కలిసొస్తుంది. తక్షణమే ఇసుక రవాణాపై గట్టి నిఘా పెట్టి పక్కదారి పడ్తున్న ఇసుకను అదుపు చేయాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

విద్య, వైద్యానికి సీఎం జగన్ పెద్దపేట

విశాలాంధ్ర - పెందుర్తి: సీఎం జగన్మోహన్ రెడ్డి విద్య, వైద్యానికి పెద్దపీట వేశారని జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేవుడు స్పష్టం చేశారు. 504 సచివాలయం పరిధిలోని గొల్లవిల్లివాని పాలెం, సాయి సౌధానగర్, ఎల్ఐసి కోలనీ, రత్నగిరి నగర్, ఎస్.ఎ.డి లే అవుట్ ప్రాంతాలకు సంబంధించి గొల్లవిల్లివానిపాలెం గ్రామంలో బుధవారం నాడు రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన దేముడు మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంతో సీఎం వై.యస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోందని పేర్కొన్నారు. గ్రామ గ్రామాన వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్ట్ డాక్టర్లతో ఉచిత పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన మందులు అందిస్తున్నారని. అవసరమైన వారికి మెరుగైన చికిత్స కోసం పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేస్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారని వెల్లడించారు. రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అందిస్తున్న సేవలు ప్రజలందరూ వినియోగించుకోవాలని తెలిపారు, కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ లక్ష్మి,స్పెషలిస్ట్ డాక్టర్లు,504 సచివాలయం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కన్వీనర్లు ఆకుల చెల్లారావు, ఆకుల వాసు, రాపర్తి సూరిబాబు, ఎమ్. మంగమ్మ, బొడ్డు దేముదుబాబు, పువ్వాడ త్రినాధ్ పాల్గొన్నారు.

సింహాద్రిపురం తారు రోడ్డు ప్రారంభం

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం మండలంలోని సింహాద్రిపురం గ్రామంలో 60 లక్షలు రూపాయలు ప్రభుత్వ నిధులతో నూతన తారు రోడ్డును ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ బుదవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ రహదారుల మరమ్మత్తులకు ప్రతిపాదించామన్నారు. కొన్నింటిని ఇప్పటికే కొత్తవి వేస్తున్నామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, వైఎస్సార్సీపీ పార్టీ నాయకులు కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు సచివాలయం కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు..

మొదటి మౌత్ వాష్‌ను విడుదల చేసిన సెన్సోడైన్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భారతదేశంలో మౌత్ వాష్ అనేది ఓరల్ కేర్ విభాగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న విభాగాలలో ఒకటి. భారతీయులు మరింత ఆరోగ్య స్పృహ కలిగి ఉండడంతో, వారి రోజువారీ నోటి సంరక్షణ దినచర్యకు మౌత్‌వాష్‌ను జోడించడం ద్వారా కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సెన్సోడైన్ కోరుకుంటోంది. సెన్సోడైన్ కంప్లీట్ ప్రొటెక్షన్ ప్లస్ మౌత్ వాష్ రోజువారీ బ్రషింగ్ రొటీన్‌ను పూర్తి చేసేందుకు రూపొందించగా, నోటి సంరక్షణకు అదనపు రక్షణ పొరను జోడిస్తుంది. ఆల్కహాల్ లేని ఫార్ములేషన్‌తో, ఇది దంతాల సున్నితత్వం మరియు ఎనామెల్ పొర పాడు కాకుండా, బలమైన దంతాలను కాపాడేలా రక్షణను అందిస్తుంది. దీనిలోని ఫ్లోరైడ్ కావిటీస్‌తో పోరాడటానికి సహాయపడుతుంది. రిఫ్రెష్ కూల్ పుదీనా రుచి ఎటువంటి బర్నింగ్ సెన్సేషన్ లేకుండా తాజాదనాన్ని అందిస్తుందని హాలెన్ ఐ ఎస్ సీ ఓరల్ హెల్త్ కేర్ కేటగిరీ లీడ్ బ్బన్ సిక్కా తెలిపారు.

కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా గుర్తించాలి

విశాలాంధ్ర - పాడేరు: కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశలుగా గుర్తించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ సుందర్ రావు అన్నారు. బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో పాడేరు ఐటీడీఏ ఎదుట కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరావు మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా కార్యకర్తలుగా గుర్తించి 10 వేల రూపాయలు వేతనం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మంగమ్మ, అధ్యక్షులు పి.దాసమ్మ, జిల్లా కమిటీ సభ్యులు పార్వతమ్మ, కాంతమ్మ, మోదకొండ, బేబీ రాణి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ



విశాలాంధ్ర - చింతపల్లి: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇరువురు గాయపడిన సంఘటన జీకే వీధి మండలం రింతాడ పంచాయతీ అసరాడ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం చింతపల్లి నుండి స్వగ్రామమైన కొట్నాపల్లి వెళ్తున్న పాతుని గోవింద్, పెద వలస నుండి స్వగ్రామమైన పెంటపాడు వస్తున్న కొరియర్ బోయ్ కాకరి రాంబాబు లు ప్రయాణిస్తూ ఎదురెదురుగా బలంగా ఢీకొనడంతో ఇరువురికి గాయాలయ్యారు. వీరి ఇరువురిలో కొట్నాపల్లి గ్రామానికి చెందిన పాతుని గోవింద్ కు కాలు విరగడంతో హుటాహుటిన చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. స్థానిక ఆర్థోపెడిక్ వైద్యాధికారి సాయికృష్ణ క్షతగాత్రునికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్య సేవల నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పద్మనాభ యుద్ధ స్థలాన్ని సందర్శించిన ఎంపీ జివిఎల్

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభంలోని పద్మనాభ యుద్ధ స్థలం ప్రాంతాన్ని జివిఎల్ నరసింహారావు బుధవారం సందర్శించారు. అక్కడ ఉన్న పద్మనాభ యుద్ధం చేసిన రెండవ విజయరామరాజు సమాధిని విగ్రహాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్థల ప్రాముఖ్యతను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బిజెపి కార్యకర్త జంగాల నరసింహమూర్తి టీ దుకాణంలో అల్పాహారం తీసుకొని తేనీరు సేవించారు. ఈ కార్యక్రమంలో ఏపీ బిజెపి వైద్య విభాగం కన్వీనర్ రూపకల రవికుమార్, బీజేవైఎం భీమిలి నియోజకవర్గం ఇంచార్జ్ బొడ్డు రవికుమార్, పార్టీ అధ్యక్షుడు ఆర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు. అనంతపద్మనాభుని క్షేత్రాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు.

సీపీఎం అండతో ఆటస్థలం చదును

విశాలాంధ్ర - పెందుర్తి : సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కార్మిక నగర్ లో సుమారు 100 మంది పేదలు పాకలు వేసి గ్రామానికి కావలసిన గ్రౌండ్ ను చదును చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బీ.జగన్ మాట్లాడుతూ 2019 నుంచి అనేక దఫాలుగా అధికారుల దగ్గరికి, ప్రజా ప్రతినిధులు దగ్గరకీ తిరగామని, వారు చూస్తాం చేస్తాం చెప్పడం తప్ప పేదలకు ఇల్లు ఇవ్వలేదన్నారు. ఇప్పటికే పెందుర్తి ప్రాంతంలో పెద్దలు రాజకీయ నాయకులు ఎకరాలు ఎకరాలు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, పేదలకు 60 గజాల స్థలం ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని విమర్శించారు. దీంతో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మొత్తం 100 మంది పేదలు ప్రభుత్వ భూమిలో పాకలేసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జోన్ సభ్యులు శంకర్రావు అప్పలనాయుడు, విజయమ్మ ,వాసు ఈశ్వర్రావు, అన్నపూర్ణ, లక్ష్మి, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసాలు

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం గాంధీ గ్రామం శ్రీ విజ్ఞాన్ స్కూల్‌లో వసంత పంచమి పర్వదినం పురస్కరించుకుని బుదవారం చిన్నారులకు సామూహిక ఉచిత అక్షరాభ్యాసాలు నిర్వహించారు. చోడవరంతో బాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన తల్లితండ్రులు చిన్నారులు అదిక సంఖ్యలో పాల్గొని వసంత పంచమి పర్వదినాన్ని వినియోగించుకున్నారు. వేద పండితులు ఆధ్వర్యంలో సరస్వతి హెూమం నిర్వహించి, అక్షరాభ్యాసం చేయించినట్లు విజ్ఞాన్ స్కూల్ డైరెక్టర్ ఎం.ఎం.కె.రాజు తెలిపారు. స్వయంభూ విఘ్నేశ్వర స్వామి సన్నిధిలో కూడా వసంతి పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు.

చింతపల్లి: వసంత పంచమి సందర్భంగా చదువుల తల్లి సరస్వతీ దేవి జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక విజ్ఞాన భారతి పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ మోహన్, ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పురోహితుడు వీరమిష్టి వీరాస్వామి విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్, ప్రిన్సిపాల్‌లు మాట్లాడుతూ విద్యనభ్యసించే ప్రతి ఒక్కరికి అక్షరాభ్యాస కార్యక్రమం ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు లావణ్య, సూర్య కళ, విజయ కుమారి, రాధిక, వ్యాయామ ఉపాధ్యాయుడు వి కోటి బాబు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఆశ్రమ పాఠశాల విద్యార్థుల మరణాలు

-మావోయిస్టు పార్టీ వీఏఏ డివిజన్ కమిటీ

విశాలాంధ్ర - జి.మాడుగుల: ఇటీవల కాలంలో ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో మృతి చెందిన విద్యార్థుల మరణాలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని మావోయిస్టు పార్టీ విశాఖ అనకాపల్లి అల్లూరి జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి అరుణ అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రకటన ద్వారా మాట్లాడుతూ దీనికి తక్షణమే బాధ్యత వహిస్తూ పాడేరు రంపచోడవరం ఐటీడీఏ పీవోలను సస్పెండ్ చేయాలన్నారు. ఫిబ్రవరి 13వ తేదీ న విశాఖ జిల్లా మారికవలస గురుకుల పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న 12ఏళ్ళ జర్సింగి ప్రదీప్ అనే విద్యార్థి 3 రోజులుగా జ్వరంతో బాధప డుతూ వైద్యం అందక మృతిచెందడం బాధాకర మన్నారు. ఈ ఒక్క నెలలోనే వివిధ ఆశ్రమ పాఠశా లలో పది, పన్నెండేళ్ళ చిన్నారులు వరుసగా నలుగురు మరణించారన్నారు. గత ఆరు నెలల్లో ఈ మరణాలు పదుల సంఖ్యలోనే వున్నాయని అయినా ప్రభుత్వం గానీ, అధికారులు గానీ ఏమాత్రం స్పందించడం లేదని ఆరోపిం చారు. పైగా ఐ టి డిఏ ల పీఓలు, సూరజ్ గనోరే, వి. అభిషేక్, గిరిజన విద్యాశాఖ డిడి హాస్టల్ల నుండి పిల్లలు చెప్పకుండా వెళ్ళిపోతున్నారనీ, తల్లితండ్రులు నిరక్షరాసులు కావడం వలన, నాటువైద్యం అందించడం వలనే పిల్లలు మరణిస్తున్నారనీ తప్పంతా వాళ్ళదేనన్నట్టు అత్యంత నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారన్నారు. ఇప్పటి వరకూ జరిగిన మరణాలపై తక్షణమే న్యాయ విచారణ చేపట్టి బాధ్యులను శిక్షించాలన్నారు. చిన్నారులను కోల్పో యిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం నష్టపరి హారాన్ని ప్రకటించాలన్నారు. ఈ డిమాండ్స్‌ను సాధించేవరకూ విద్యార్థులు, తల్లితండ్రులు, ఆదివాసీ సంఘాలు ఆందోళనలు చేపట్టాలని, ఈ ఆందోళనలలో అన్ని సెక్షన్ల ప్రజలు, ప్రజాస్వా మిక వాదులు పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేసారు.

బోడి దొరకు మెరుగైన వైద్య సేవలు

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజన యోధుడు, దేశం కోసం ప్రాణాలర్పించిన గాం గంటం దొర మనవడు బోడి దొరకి అల్లూరి సీతారామరాజు యువజన సంఘం చొరవతో వైద్య సేవలు సక్రమంగా అందిస్తున్నట్టు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు చెప్పారు. బోడి దొర ఆరోగ్యం క్షీణించడంతో పాడేరు ఐటీడీఏ పీవో వి. అభిషేక్ ఆదేశాల మేరకు విశాఖపట్నం కేజీహెచ్ ఆసుపత్రిలో చేర్చగా తొలుత కేజీహెచ్ లో ఒక రూములో సురక్షితంగా ఉంచి ఆయనకు వైద్య సేవలు అందిస్తూ వచ్చారని, అయితే మంగళ వారం ఆయన్ను రాజేంద్రప్రసాద్ వార్డులో ఏఎంసిఐఐ బ్లాక్ వరండాలోకి నెట్టివేశారని, దీనిపై జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యదర్శి శివంగి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యుడు పోతిన వెంకటేశ్వరరావు తదితర ప్రతినిధుల బృందం వెళ్లి ఆసుపత్రి వర్గాలతో మాట్లాడితే నిర్లక్ష్యంగా వ్యవహరించారని, దీనిపై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా మరలా బోడి దొరను గదిలో చేర్చి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నార న్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలపట్ల కేజీహెచ్ ఆసుపత్రి తీరుకు ఆవేదన వ్యక్తం చేశారు. బోడి దొర కోలుకునే వరకు మెరుగైన వైద్యం అందించాలని, అప్పటివరకు ఆయన కుటుంబ పోషణకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కాకరపాడు వచ్చిన పడాల వీరభద్రరావు వెంట జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యదర్శులు శ్యామల వరలక్ష్మి, అంబటి వరహాల రాజు, కార్యవర్గ సభ్యులు మాకాడ బూరుగులయ్య, కోన సత్యనారాయణ ఉన్నారు.

నారా లోకేష్ శంఖారావంను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - పద్మనాభం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేష్ బాబు శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ కోరాడ రాజబాబు అన్నారు. సమావేశం ఏర్పాటు చేసి నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం మండల టిడిపి పార్టీ అధ్యక్షులు కోరాడ రమణ, రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు కసిరెడ్డి దామోదర్‌రావు, తునివలస ఆర్‌ఏఎన్ మూర్తి, నియోజకవర్గ వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు కంటుబోతు ఎర్రి నాయుడు, పెంట సర్పంచ్ పావని, ఆవాల గంగరాజు, పాండ్రంగి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి తగిన బుద్ధి చెప్పండి

విశాలాంధ్ర - విశాఖ : మోడీ నాయకత్వంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేస్తున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. విశాఖలో మంగళవారం ఆయన విలేకరులతో సమా వేశంలో మాట్లాడుతూ ప్రత్యేక హెూదా, విభజన హామీలు అమలు చేయకుండా, విశాఖ స్టీల్ ప్లాంట్ ను అమ్ముతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. విశాఖ రైల్వే జోన్ కు నిధులు కేటాయించకుండా రాష్ట్ర ప్రభుత్వం స్థలం ఇవ్వలేదన్న అబద్ధపు ప్రచారాలతో బిజెపి నాయకులతో నిరసనలు తెలియజేయించడం విడ్డూరంగా ఉందన్నారు. స్థలాన్ని కేటాయిం చినట్లు జిల్లా కలెక్టర్ స్పష్టంగా లేఖ రాశారని గుర్తు చేశారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ అమ్మడం లేదని జివిఎల్ నరసింహారావు ఒక పక్క ప్రకటన చేస్తే మరోవైపు స్టీల్ ప్లాంట్ ని అమ్మి తీరుతామని మోడీ ప్రకటనలు చేయడం రాష్ట్ర ప్రజలను మోసగించడమేనని ఎద్దేవా చేశారు. ఆంధ్ర రాష్ట్రంలో బిజెపి బలపడడం కోసం కుటిల ప్రయత్నాలు చేస్తున్నదని దానికి వైసిపి, టిడిపి, జనసేన పోటీపడి సహకరించడం ఆందోళనకర విషయం అన్నారు. పోలవరం ప్రాజెక్టు, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ మోడీ ప్రభుత్వం అమలు చేయకపోయినా బిజెపితో అంట కాగడం రాష్ట్ర ప్రజల్ని తాకట్టు పెట్టడమే అన్నారు. మొన్నటి వరకు ఆంధ్ర రాష్ట్రంలో మూడు రాజధానులు చెప్పిన వైసీపీ ఇప్పుడు రాష్ట్ర రాజధాని హైదరాబాదు అని చెప్పడం సిగ్గుమాలిన ప్రకటన అని అన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో బిజెపిని దానికి సహకరిస్తున్న వైసీపీ తెలుగుదేశం జనసేన పార్టీలను 2024 ఎన్నికల్లో తగన బుద్ధి చెప్పాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం, ప్రజలకు అండగా ఉన్న సిపిఎం, సిపిఐ పార్టీలను బలపర్చాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అమర జవాన్లకు మాంటిస్సోరి విద్యార్థుల నివాళి

విశాలాంధ్ర - కూనవరం: 2019 ఫిబ్రవరి 14న పుల్వామా దాడిలో అశువులుబాసిన అమర జవాన్లకు నివాళిగా కూనవరం మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. 40 మంది సైనికులు దేశం కోసం ప్రాణాలు వదిలిన ఈ రోజును బ్లాక్ డేగా అభివర్ణించారు. అత్యధిక దురదృష్టకరమైన దినమని వారి త్యాగాల స్ఫూర్తితో భవిష్యత్ తరాలు ముందుకు సాగాలని స్కూల్ ప్రిన్సిపాల్ విక్కీ సింగ్ అన్నారు.

25న తెలగా కులం బహిరంగ సభ

విశాలాంధ్ర - పద్మనాభం: ఈనెల 25న విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలో తెలగా కులం ఉత్తరాంధ్ర బహిరంగ సభను విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర తెలగా కులం అధ్యక్షులు పి.వెంకట రామారావు కోరారు. జనవరి 28న ఇచ్ఛాపురంలో ప్రారంభించిన పాదయాత్ర పాయకరావుపేటలో ముగుస్తుందన్నారు. పాదయాత్ర ముగిసిన అనంతరం బహిరంగ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. పాదయాత్రలో భాగంగా పద్మనాభం జంక్షన్ మీదుగా రేవిడి పంచాయతీలో ముగిసి భీమిలి మండలం పాదయాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గిరిబాబు, ఆర్.జగదీష్ బాబు, ఎస్.ఆది బాబు, కే.దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రవీంద్ర భారతిలో అక్షరాభ్యాసం

విశాలాంధ్ర - పెందుర్తి: సుజాతనగర్ రవీంద్ర భారతి పాఠశాలలో వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసాలను ఘనంగా నిర్వహించారు. 9, 10 తరగతుల విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జిఎం రమ్య మాట్లాడుతూ ఏ పని అయినా మంచి రోజున ప్రారంభిస్తే అది తప్పక విజయవంతమవుతుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సరస్వతి పూజలో పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ఆమె మండలంలో పర్యటించారు. రాజుపేట, రేకపల్లి పంచాయతీ సచివాలయాలు, రేకపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవనాలను ఆమె రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం వైయస్సార్ క్రాంతి పదం వెలుగు కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో

ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైయస్సార్ ఆసరా, వైయస్సార్ చేయూత, అమ్మ ఒడి తదితర సంక్షేమ పథకాల గురించి ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

గీతం విద్యార్థి ఆత్మహత్య

విశాలాంధ్ర - విశాఖ క్రైం: గీతం కళాశాలలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి మంగళవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యార్థి ఆత్మహత్య సమాచారం అందుకున్న ఆరిలోవ పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - పరవాడ: సిఐటియు ఆధ్వర్యంలో ఈనెల 16న దేశవ్యాప్తంగా జరిగే కార్మిక రైతు గ్రామీణ సమ్మెను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఫార్మాసిటీలోని విజయశ్రీ పరిశ్రమ నుండి ఐఓసి కంపెనీ వరకు బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్

ర్యాలీని ప్రారంభించిన అనంతరం గనిశెట్టి మాట్లాడారు. రవాణా కార్మికులకు ఉరితాడు లాంటి బిఎన్ఎస్ చట్టాన్ని రద్దు చేయాలని, సెక్షన్ 106లో 1,2 చట్టాలను, జీవో నెంబర్ 21ని పూర్తిగా రద్దు చేయాలని, రవాణా రంగ కార్మికులకు నష్టం కలిగించే చట్టాలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్ మతతత్వ విధానాలను ప్రతి ఘటించాలని ఆయన పిలుపు నిచ్చారు. మోడీ ప్రభుత్వం వైఫల్యాలపై పోరాడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కార్మిక ఉద్యోగి వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.అప్పలరాజు, ఎం.మునిలినాయుడు, జి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాలకు నాణ్యమైన వైద్యం : ఎంపీ వెంకట సత్యవతి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పేద, మధ్య తరగతి వర్గాలందరికీ నాణ్యమైన, అత్యున్నత స్థాయి వైద్య సేవలను ఇంటి వద్దకు అందుబాటులోకి తీసుకువచ్చారని అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి పేర్కొన్నారు. 82 వ వార్డు కార్పొరేటర్ శ్రీమతి మందపాటి సునీత జానకి రామరాజు ఆధ్వర్యంలో 82 వ వార్డు 4 వ సచివాలయం ఉడ్ పేట పాఠశాల ప్రాంగణం లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు ఈ సందర్భంగా ఎంపీ సత్యమ్మ మాట్లాడుతూ. శిబిరంలో వైద్య నిపుణులు అందరికీ ఉచితంగా పరీక్షలు చేసి, మందులను అందజేస్తున్నారన్నారు. శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 82 వ వార్డ్ కార్పొరేటర్ శ్రీమతి మందపాటి సునీత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో పేదలకు అన్ని విధాలుగా ఆదుకోవడమే లక్ష్యంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు మంద పాటి జానకి రామరాజు మాట్లా డుతూ .అన్ని సంక్షేమ పథకాలు పేద లందరికీ సక్రమంగా అందాలంటే ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని మరోసారి ఎన్నుకోవల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ కాండ్రే గుల విష్ణుమూర్తి, జోనల్ కమి షనర్ అయ్యప్ప నాయుడు , వై ఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జాజుల రమేష్, 84 వార్డు వ ఇన్చార్జ్ కోరుకొండ రాఘవ, డాక్టర్ లక్ష్మీ నారాయణ తది తరులు పాల్గొన్నారు. ముందుగా శిబిరంలో రోగు లకు ఎంపీ వైద్య సేవలు అందించారు. పరీక్షల రిపోర్టులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పలక సత్య నారాయణ, 84, బుద్ధ భాస్కర్ రావు, యువజన అధ్యక్షుడు ఉగ్గిన అప్పారావు, కారుకుండి కన్నా యాదవ్, నాగులపల్లి వీర్రాజు, కూండ్రపు సత్తిబాబు, గౌరీపతి మాస్టారు, కోన ఉమా, సకురు చంద్రం, చవితిని నూకరాజు, చింతా రాంజి, రేబాక స్వామి, పేటూరి కళ్యాణ్ పాల్గొన్నారు.

డ్వాక్రా మాహిళలకు నాలుగో విడత ఆసరాలో రూ.9.26 కోట్ల లబ్ధి

విశాలాంధ్ర - మాకవరపాలెం : మండలానికి వైఎస్సార్ ఆసరాలో నాల్గోవిడతగా 13,597 మంది డ్వాక్రా మహిళలకు రూ. 9.26 కోట్ల లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. స్థానిక హైస్కూల్లో బుధవారం ఆసరా లబ్ధిదారులకు ఆయన చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే సీఎం జగన్ లక్ష్య మన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షుడు వాసు, జడ్పిటీసీ సత్యవేణి, వైస్ ఎంపిపి లక్ష్మి, కో ఆపరేటివ్ అధ్యక్షులు పాశపు నాగేశ్వరావు వైసీపీ నేతలు హరిబాబు, భద్రాచలం, రమణ, గోవింద, పిల్లా శ్రీను, తహసీల్దార్ మురళీమోహన్ రావు, ఎంపీడీవో జాన్ లింకన్, డిప్యూటీ తహసీల్దార్ శంకరావు పాల్గొన్నారు.

పంపు స్టోరేజ్ పవర్ హౌస్ పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం తగదు

విశాలాంధ్ర - సీలేరు : పంపు స్టోరేజ్ పవర్ హౌస్ పేరుతో ప్రజలను ఇబ్బందులు పెట్టడం తగదని కాంగ్రెస్ పార్టీ అల్లూరి జిల్లా అధ్య క్షులు వంతల సుబ్బారావు అన్నారు. బుధ వారం ఆయన మాట్లాడుతూ గూడెంకొత్తవీధి మండలం సీలేరు గ్రామంలో నూతనంగా నిర్మించ బోయే పంపు స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు నిర్మాణం వలన సీలేరు పరిసర ప్రజలకు ఎటువంటి హాని జరిగిన కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఇటీవల కొందరు జెన్కో అధికారులు ప్రాజెక్టు పేరు చెప్పి ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అదే జరిగితే తప్పనిసరిగా సంబంధిత ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటు ందన్నారు. ఏజెన్సీలో నూతనంగా నిర్మించబోయే పవర్ ప్రాజెక్టుల విషయంపై ఇప్పటికే మా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్.షర్మిల దృష్టిలో ఉందని, సందర్భం వచ్చి నప్పుడు ఆమె ఈ విషయంపై స్పందిస్తారన్నారు. చింతపల్లి మండలం ఎర్రవరం పవర్ ప్రాజెక్టు పరిస్థితి, సీలేరు పంపు ప్రాజెక్టుకు రాకుంట చూసుకో వాలన్నారు. ఇప్పటికైనా ఏపి జెన్కో ఉన్నతాధి కారులు స్పందించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా చూసుకోవాలని ఆయన చెప్పారు.

7వ వార్డులో మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - కొమ్మాది : జీవీఎంసీ 7వ వార్డ్ లో జరిగిన మెగా వైద్య శిబి రంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న భీమిలి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ కోరాడ రాజబాబు ఈ రోజు భీమిలి నియోజక వర్గ పరిధి జీవీఎంసీ 7వ వార్డులో చంద్రంపాలేంలో జిమ్ సర్ గీతం వైద్య కళాశాల ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించి అన్ని రకాల వైద్య పరీక్షలు మరియు నిష్ణాతులైన వైద్యులచే పరీక్షలు చేయించి అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయడానికి నిర్ణయించి మందులు ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమం గీతం విద్యాసంస్థల అధినేత విశాఖ పార్లమెంట్ అభ్యర్థి మతుకు మిల్లి శ్రీ భరత్ నిర్వహించిన వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ మరియు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోరాడ రాజబాబు 7వ వార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ మరియు టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ నిర్వాహక కార్యదర్శి పిల్లా వెంకటరావు గారూ పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వారితోపాటు 7వ వార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ నిర్వాహక కార్యదర్శి పిల్లా వెంకటరావు గారూ యూనిట్ ఇంఛార్జ్ నాగోతి సూర్యప్రకాష్ గారు, టీఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ, వార్డు ప్రధాన కార్యదర్శి మరియు యూనిట్ ఇంఛార్జ్ కానూరి అచ్చుతరావు, జె.పి రాజు టీడీపీ సీనియర్ నాయకులు పోతిన నాయుడు మరియు పోతిన బుజ్జి రామువార్డు నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

16న గుడ్ షెఫర్డ్ స్కూల్ వార్షికోత్సవం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : ఈనెల 16న గుడ్ షెఫర్డు ఇంగ్లీష్ మీడియం వార్షి కోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ పాల్ తెలి పారు. స్కూల్లో బుధవారం జరిగిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లా డుతూ స్కూల్ స్థాపించిన 46 ఏళ్లలో ఎంతో మంది విద్యార్థినీ విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లుగా, ఇతర దేశాల్లో స్థిరపడ్డారని తెలిపారు. మా తండ్రి వినయా నంద్ 1978లో ఈ స్కూల్ను స్థాపించి తక్కువ ఫీజుతో ఉన్నత విద్యను అందించామని తెలిపారు. మా స్కూల్లో చదువుకున్న పదో తరగతి విద్యార్థులకు అప్పటి నుంచి ఇప్పటి వరకు విద్యార్థులు నూరుకు నూరు శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించడంతో పాటు అనర్గళంగా ఇంగ్లీషులో మాట్లాడతారన్నారు. 46 వార్షికో త్సవం ఈ నెల 16న శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభ మౌతుందన్నారు. ముఖ్య అతిధులుగాజిల్లా ఎస్పీ కే.వి.మురళీకృష్ణ, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, డైట్ కరస్పాండెంట్ దాడి రత్నాకర్, హాజరవు తారన్నారు. వార్షికోత్సవం సందర్భంగా గత వారం రోజుల నుంచి విద్యకు ఎటువంటి ఆటంకం కలగకుండా విద్యార్థులకు పాటలు, నృత్యాలలో శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. స్కూల్ వార్షికోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేయడం జరిగిందని, స్కూల్ ఆవరణలో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని పాల్ తెలిపారు.

నాసా పోటీలకు రవీంద్రభారతి విద్యార్థులు

విశాలాంధ్ర - ఆనందపురం : నాసా పోటీలకు రవీంద్రభారతి విద్యార్థులు నాసా పోటీలకు మండలం లోని వెల్లంకి రవీంద్ర భారతి గ్లోబల్ పాఠ శాల విద్యార్థులు సన్నద్ధమ వుతున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఉమా మహేష్ తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేషనల్ ఏరోనాటిక్స్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ నాసాలో దక్షిణ భారతావని లోనే ప్రప్రథమంగా 2009వ సంవత్సరంలో మొదలైన రవీంద్ర భారతి విద్యా సంస్థల ప్రస్థానం గత 15 సంవత్సరాలుగా రవీంద్ర భారతి విద్యా సంస్థల ప్రణాళిక రచన,విధి విధానాలు, క్రమశిక్షణ లనే ఆయుధాలుగా మలచి ప్రతి సంవత్సరం విజయ బావుటా ఎగురవేస్తూ రవీంద్ర భారతికి సాటి ఏ సంస్థ కాదు పోటీ అంటూ వివిధ అంశాలలో విజయ దుందుభి మోగిస్తున్న ఏకైక విద్యాసంస్థ రవీంద్ర భారతి మాత్రమే అన్నారు. ఫోనిక్స్, నోవా టెర్రజోప్రాజెక్టులతో సంసిద్ధమయ్యారు అని పాఠశాల ప్రిన్సిపాల్ ఉమా మహేష్ తెలిపారు.

జీ తెలుగులో వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా గద్దర్ 2

విశాలాంధ్ర - విశాఖపట్నం : బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టించిన గదర్2ని వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ గా తెలుగులో ప్రసారం చేయనుందనీ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమోషనల్ఎంటర్టైనర్ గదర్ 2, ఈ నెల 18 వ తేది సాయంత్రం 5:30 గంటలకు, మీ జీ తెలుగులో వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు. అనిల్ శర్మ దర్శకత్వంలో 2001లో వచ్చిన బ్లాక్ బస్టర్ గదర్, ఏక్ ప్రేమ్ కథ'కు సీక్వెల్గా ఈ సినిమా తెరకెక్కిందన్నారు. బాలీవుడ్ స్టార్యాక్టర్స్ సన్నీ డియోల్, అమీషా పటేల్, ఉత్కర్ష్ శర్మ నటించిన ఈ చిత్రం 1971 ఇండో-పాకిస్థాన్ యుద్ధంలో తారా సింగ్ (సన్నీ డియోల్) ప్రయాణమే ప్రధాన ఇతివృత్తంగా తెరకెక్కిందని వివారించారు. జైలులో ఉన్న తన కుమారుడు చరణ్జీత్సింగ్ (ఉత్కర్ష్ శర్మ) ను రక్షించడానికి పాకిస్థాన్ నుంచి తిరిగివచ్చిన తారా సింగ్ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నాడనేది ఈ సినిమా కథన్నారు. థియేట్రికల్ రిలీజ్సక్సెస్ తర్వాత 18న సాయంత్రం 5:30 గంటలకు జీ తెలుగులో ప్రసారం కానున్న 'గదర్ 2' ప్రేక్షకులకు అదిరిపోయే వినోదాన్ని పంచడానికి సిద్ధమైందన్నారు.తెలుగు ప్రీమియర్గా ప్రసారం కానున్నబాలీవుడ్ బ్లాక్ బస్టర్ సినిమా గదర్ 2ని జీ తెలుగు వేదికగా ఈ వారాంతంలో వీక్షకులందరూ మిస్సవకుండా వీక్షించాలన్నారు.

శ్రీ ప్రకాష్‌లో ఘనంగా వసంత పంచమి వేడుకలు

విశాలాంధ్ర - పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వ హించారు. వసంత పంచమిని పురస్కరించుకొని భారతీయ సనాతన సాంప్రదాయంలో భాగంగా జ్ఞాన సముపార్జనను కాంక్షించి, సరస్వతీ దేవిని మాఘ శుద్ధ పంచమి నాడు అనగా వసంత పంచమి రోజున పూజించే ఆచారాన్ని విద్యార్థులకు తెలియజేస్తూ వేదమాత, జ్ఞాన ప్రదాయిని అయిన సరస్వతీ దేవిని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థుల చేత విఘ్నేశ్వర పూజ, సరస్వతి పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు.

వాలెంటైన్స్ డే వేడుకలో ఆల్మండ్స్ భాగం చేసుకోండి

విశాలాంధ్ర - విశాఖ సిటీ : వాలెంటైన్స్ డే సందర్భంగా జరిగే వేడుకలలో ఆరోగ్య పోషకాహారం కలిగిన స్నాక్స్ కు ప్రాధాన్యం ఇస్తూ బాదములను వినియోగించాలని పలువురు ఆహార రంగ నిపుణులు నటి సోహా అలీఖాన్, న్యూట్రిషన్ అండ్ వెల్నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన ప్రత్యేకమైన బహుమతులలో బాదం ఒకటి కావచ్చునన్నారు. బాదంపప్పులు, వాటి ఆహ్లాదకరమైన కరకరలాడే రుచి మరియు అనేక ఆరోగ్య ప్రయోజనాలకు ప్రసిద్ధి చెందాయన్నారు. ఇది అర్థవంతమైన పోషకమైన సంజ్ఞగా ఉపయోగపడుతుందని జింక్, ఫోలేట్, ఐరన్, విటమిన్ ఇ, మెగ్నీషియం, ప్రోటీన్లతో సహా 15 పోషకాలతో నిండిన బాదం గింజలు అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలకు దోహదం చేస్తాయన్నారు. ఇవి గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి, చర్మ ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయనీ బరువు నిర్వహణలో సహాయపడతాయి రక్తంలో చక్కెర నియంత్రణను నిర్వహించడంలో సహాయపడతాయన్నారు. తన రోజువారీ ఆహారంలో బాదం యొక్క ప్రాముఖ్యతను గురించి వారు వివరించారు.

ఆర్వై అగ్రహారంలో ఈ నెల 18న పుష్ప యాగం

విశాలాంధ్ర - కె.కోటపాడు : మండలంలోని రామయోగి అగ్రహారం గ్రామంలో హనుమాన్ లక్ష్మణ సమేత శ్రీ సీతారామస్వామి సన్నిధిలో ఈనెల 18వ తేదీన ఘనంగా పుష్పయాగం జరిపిస్తున్నట్లు మండ రమణమూర్తి తెలిపారు.సింహాచలం దేవస్థానం ను ంచి11 మంది వేద పండితులతో టన్నున్నర పుష్పాలతో పుష్పయాగం జరిపింపబడునని కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని తెలిపారు. ఈపుష్పయాగంలో కులం మతం వ్యత్యాశ లేకుండా వందల మంది దంపతులు పాల్గొని పూజలు నిర్వహించవచ్చు అన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ అన్న సమారాధన నిర్వహించబడునని ఈ అన్న సమారాధనకి గ్రామ ప్రజలతోపాటు మండల గ్రామాల ప్రజలు పాల్గొని స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమానికి భక్త మహాశయులు, గ్రామ పెద్దలు, ప్రజలు, యువకులు, మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ సీతారామచంద్రుల కరుణ కటాక్షములు పొంది ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుకుంటున్నాం.

బిజెపి అధికారంతోనే గిరిజన ప్రాంత అభివృద్ధి
భాజపా అధ్యక్షుడు రమేష్

విశాలాంధ్ర - దంబ్రిగూడ : భారతీయ జనతా పార్టీ అధికార పాలన కేంద్ర ప్రభుత్వంతోనే గిరిజన గ్రామాలు అభహవృద్ధి చెందుతాయని భాజపా మండలశాఖ అధ్యక్షుడు కిరసాని. రమేష్ అన్నారు. మండలంలోని కితలంగి పంచాయతీ గాంధ గ్రామంలో ఆ పార్టీ నాయకులు సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజనులు వ్యవసాయంతో వృద్ధి చెందాలనే ఆకాంక్షతో పీఎంకిసాన్ పథకంతో ఆదుకుంటుందన్నారు. పేద గిజనులకు సొంతింటి కలను సాకారం చేసుకునేలా గృహాలను మంజూరు చేస్తుందని చెప్పారు. మారుమూల గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందడానికి శాశ్వత రోడ్ల నిర్మాణాలను చేపడుతుందన్నారు. ఈ తరుణంలో రాబోయే ఎన్నికల్లో భాజపాకు ఆదరించి మోదిని ప్రధానమంత్రిని చేయాలని ఆయన కోరారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు భాజపా చేరారు. అరకు అసెంబ్లీ కో-కన్వీనర్ బలరాం, బీజేఎంవై జిల్లా ఉపాధ్యక్షుడు సద్దు, మండల ఉపాధ్యక్షుడు మహేంద్ర, యువమోర్చ మండల నాయకుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమిత్వం కోల్పోయిన జగన్ సర్కార్ : గంటా నూకరాజు

విశాలాంధ్ర - భీమిలి : మూడు రాజధానులు అన్నారు, విశాఖ పరిపాలనా రాజధాని అన్నారు. ఇదిగో వచేస్తున్నాం అదిగో వచ్చేస్తున్నాం అన్నారు.. అవన్నీ కాదు ఇప్పుడు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని కావాలట ఈ ఐదేళ్ల కాలంలో జగన్ సర్కార్ ట్విస్టులకు కొదవే లేదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. రెండేళ్లు హైదరాబాద్ను ఉమ్మడి రాజధానిగా ఉంచాలని కేంద్రాన్ని కోరుతామని వైవీ సుబ్బారెడ్డి ప్రక టనపై గంటా నూకరాజు స్పందించారు. మతిస్థిమిత్వం కోల్పోయి, కుడితిలో పడ్డ ఎలుకలా వైకాపా నాయకుల ప్రకటనలు ఉన్నాయని అన్నారు. వైసిపీ అధికారంలోకి వచ్చి వారం రోజులకే మూడు రాజధానులు కడతామని దంచికొట్టిన వాగ్దానాల మాటలు నేడు ఏమ య్యాయని అన్నారు. అమరావతిని సర్వనాశనం చేసి, మరొక రెండు నెలల్లో ఎన్నికలు ఉన్నాయనగా ఇప్పుడు హైదరాబాద్ కోసం మాట్లాడటం దెయ్యాలు వేదాలు అల్లినట్లు ఉందని అన్నారు. ఇప్పటికైనా మీకు రాజధాని కట్టడం చేతకాదని ఒప్పుకున్నారని అన్నారు. రాష్ట్ర ప్రజలు అమరావతిని రాజధానిగా కోరుకుంటున్నారని, అది తెలుగుదేశం - జనసేనాకే సాధ్యమని గంటా నూకరాజు అన్నారు.

విశాఖ ఎంపీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నా
తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు ఫణిశయనసూరి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : విశాఖ ఎంపీగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలుగుదండు వ్యవస్థాపక అధ్య క్షుడు పరవస్తు ఫణిశయనసూరి ప్రక టించారు. పరవస్తు పద్యపీఠం, తెలుగు దండు ఆధ్వర్యంలో తెలుగుభాష రక్షణ కోసం ఉద్యమాలు నిర్వహిస్తూ, పాల కులతో పోరాడుతున్నామని, 'తెలుగుదండు' విసిగి వేసారి, ఈ సారి ప్రత్యక్ష రాజకీయాలలో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నామని తెలిపారు. బుధవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో విలేఖరుల సమావేశం నిర్వహించి పరవస్తు ఫణిశయనసూరి రాజకీయాల్లోకి వస్తున్నట్లు వెల్లడించారు. పలువురు కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, మాతృభాషాభిమానుల చేతుల మీదుగా "తెలుగుదండు పొలికేక" గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈనెల 16వ తేదీ, శుక్రవారం ఉదయం 10గం.లకు.. జివిఎంసి గాంధీ పార్కులో, 24గం.ల ఉపవాస దీక్షతో ప్రజా ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నామని. నాటినుంచి.. 60 రోజులపాటు, ఎన్నికలు ముగిసేంతవరకు.. ఒంటిపూట భోజనంతో, కాళ్ళకు చెప్పులు లేకుండా నగరమంతా పర్యటించి.. మాతృభాషాభిమానులు, యువత భాగస్వామ్యంతో, తెలుగుదండు వ్యవస్థాపక అధ్యక్షుడు, పరవస్తు ఫణిశయనసూరి తెలియజేశారు. ఈ సమావేశంలో.. ఉద్యమ పెద్దలు.. రాజమన్నార్, గంగరాజు, భానుకుమార్, గిరిబాబు, సాహితీవేత్తలు.. డి.వి.సూర్యారావు, శేఖరమంత్రి ప్రభాకర్, చిన సూర్యనారాయణ, నాగుల శ్రీనివాస్, కళాకారులు.. దండు నాగేశ్వరరావు, జగత్ రావు. బాదంగీర్ సాయి, శివజ్యోతి, హేమా, తెలుగుదండు సారథులు.. శ్రీధర్, తన్మయి శేఖర్, అరుణకుమార్, నందూరి ప్రభాకర్, ఎస్.ఎస్.ఆర్, పైలా గీతిక, తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి విధేయులం తప్ప... వ్యక్తులకు కాదు
చౌడుపల్లి సర్పంచ్ లలిత ఎంపీటీసీ మీనా కుమారి

విశాలాంధ్ర - చింతపల్లి : తాము వైకాపా పార్టీకి విధేయులం తప్ప వ్యక్తులకు కాదని చౌడుపల్లి సర్పంచ్ గెమ్మేల లలిత, ఎంపీటీసీ సభ్యురాలు లువ్వాబు మీనా కుమారి లు అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ వైకాపాలో పదవులు అనుభవించి స్వప్రయోజనాల కోసం పార్టీలు మారే వ్యక్తులు చేసే ఆరోప ణలలో వాస్తవం లేదన్నారు. ఈనెల 10న చింతపల్లిలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ రచ్చబండ కార్యక్రమంలో వైకాపాకు చెందిన ట్రైకార్ చైర్మన్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే అన్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గానికి చెందిన మరి కొంతమంది త్వరలోనే తన బాటలోనే పయనిస్తారని జరుగుతున్న ప్రచారం వాస్తవ విరుద్ధం అన్నారు. చింతపల్లి మండలం నుంచి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అంతా పార్టీకి విధేయులుగా ఉన్నారన్నారు. ముఖ్యంగా తాము వైకాపా నుంచి దూరం అయ్యే ఆలోచనలో లేమన్నారు. పార్టీ నిర్ణయమే తమకు శిరోదార్యమన్నారు. వైకాపా నుంచి ఎవరిని అభ్యర్థులుగా ప్రకటించినా వారి వెంట పనిచేసేందుకు, వారిని గెలిపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. తమకు పార్టీ ముఖ్యం తప్ప వ్యక్తులు కాదని వారు పునరుద్ఘాటించారు.

స్కోడా ఆటో స్లావియా స్టైల్ ఎడిషన్ విడుదల

విశాలాంధ్ర - విశాఖ సిటీ : రెండేళ్లలో లక్ష అమ్మకాలను సాధించిన తర్వాత, స్కోడా ఆటో ఇండియా తన అత్యధికంగా అమ్ముడైన, ఫైవ్-స్టార్ సేఫ్, క్రాష్-టెస్టెడ్ సెడాన్ యొక్క స్లావియా స్టైల్ ఎడిషన్ను పరిచయం చేసింది. ఉత్పత్తి గురించి మాట్లాడుతూ, స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పీటర్ జనేబా ఇలా అన్నారు. "స్లావియా స్టైల్ ఎడిషన్ వివేకం గల కస్టమర్లను వినడానికి మా కస్టమర్ల కోసం చాలా ప్రత్యేకమైన, ఇంకా అధిక విలువ కలిగిన ఉత్పత్తిని అందించడానికి మరో ఉదాహరణ. ఇది చాలా పరిమిత సంఖ్యలో వస్తుందన్నారు. చాలా దృష్టి కేంద్రీకరించబడిన తమ కస్టమర్ల కోసం, కానీ భారతదేశం అంతటా మా 200-ప్లస్ సేల్స్ టచ్పాయింట్లలో అందుబాటులో ఉంటుందన్నారు. స్టైల్ ఎడిషన్ స్లావియా యొక్క టాప్ ఆఫ్ ది లైన్ స్టైల్ వేరియంట్ పైన స్లాట్ చేయబడిందన్నారు. ఇది డ్యూయల్ డాష్ కెమెరా వంటి ఫీచర్లతో ప్రామాణికంగా వస్తుందని చెప్పారు.

ఆదివాసీల పక్షాన ఆదివాసీ నాయకులు ఉండటం లేదు

విశాలాంధ్ర - జీకేవీధి : ఆదివాసీల పక్షాన ఆదివాసీ నాయకులు ఉండటం లేదని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మొట్టడం రాజబాబు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రాంతీయ పార్టీలు, జాతీయ పార్టీలలో క్రియశీలకంగా పని చేస్తున్న ఆదివాసీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానభూతిపరులు గమనించాల్సిన బాధ్యత ఉందన్నారు. దేశంలో ఏ పార్టీ ఆదివాసీలదో, ఏ పార్టీ ఆదివాసీల పక్షాన నిలబడుతోందో తెలుసుకోవాలన్నారు. ఈ దేశానికి మూలవాసులైనా ఆదివాసీలు ఆత్మ గౌరవంతో ఆలోచించాలని, ఆదివాసీలు అమాయకులు, వారి బాధలు, కష్టాలు, నష్టాలు చెప్పుకోలేని నిస్సాహాయ స్థితిలో ఉన్నారన్నారు. ఏజెన్సీ మాదిగలను ఎస్టీ వాల్మీకులుగా గుర్తించాలని ఏజెన్సీ మాది గలు పోరాటం మొదలు పెట్టారని, మాదిగలను ఎస్టీ వాల్మీకులుగా గుర్తిస్తే యావత్ గిరిజన జాతికే నష్టమని తెలుసుకోలేని స్థితిలో ఆదివాసీ నాయకులు ఉండడం బాధకరమన్నారు. అలాగే గతం నుండి రాజకీయ పార్టీలు ఆదివాసీలను ఉప జాతులుగా విడగొట్టి టిక్కెట్లు ఇవ్వడం, నామినేటెడ్ పోస్టులు ఇవ్వడం చూస్తుంటే ఆదివాసీలను విడగొట్టి, పాలిస్తున్నారని అర్థం చేసుకోలేని స్థితిలో ఆదివాసీ నాయకులున్నారని, బోయ వాల్మీకులను గిరిజన జాబితాలో కలుపడానికి అన్ని రాజకీయ పార్టీలు సమ్మతమే. అందులో ముందు వరసలో టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు ఉన్నాయన్నారు. టిడిపి, వైసిపి పార్టీలు బోయ వాల్మీకులను గిరిజన జాబితాలో కలపాలని అసెంబ్లీ తీర్మాణాలు చేశాయన్నారు. అలాంటి పార్టీల నుండి టిక్కెట్లు ఆశిస్తున్నందుకు సిగ్గు పడాలన్నారు.

దుద్దుపాలెం మెట్టపై శ్రీరామ పంచాయతన ఆలయ నిర్మాణ సన్నాహాలు
సుమారు 5 నుండి 10 కోట్ల రూపాయలు వ్యయంతో
దక్షిణ అయోధ్య సంకల్పంతో సమారంభం

విశాలాంధ్ర - చోడవరం (అనకాపల్లి జిల్లా) : అనకాపల్లి జిల్లా చోడవరం మండలం దుద్దుపాలెం మెట్ట పై సుమారు 5 నుండి 10 కోట్ల రూపాయల వ్యయంతో శ్రీరామ పంచాయతన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయం నిర్మా ణానికి సకల సన్నాహాలు ప్రారంభం చేశారు. 108 అడుగులు పొడవు, 81 అడుగులు వెడల్పు నిడివితో మూడు అంతస్తుల్లో, దక్షిణ అయోధ్య గా చేయ సంకల్పంతో కార్యసిద్ధి విఘ్నేశ్వరుడు, భూమి పూజతో ప్రారంభం చేసి, 3 ఏర్లుతో ఏరువాక దుక్కి చేసి నవధాన్యములు జల్లి నిర్మాణ పనులు ప్రారంభం చేశారు. మొదటి అంతస్తులో పట్టాభి రాముడు, రెండవ అంతస్తులో శ్రీ సీతారాములు, ఊర్మిళ లక్ష్మణ, భరత శత్రుఘ్నులు, సువర్చల సహిత అభయ ఆంజనేయుడు కళ్యాణ మూర్తులు, మూడవ అంతస్తులో శ్రీ రంగ నాథుడు కొలువుండే విధంగా రూపకల్పన చేశారు. శుక్ల యజుర్వేద ఘనాపాటి రాపర్తి శ్రీరాజా నరేంద్ర శర్మ వేద సంకల్పంతో శ్రీ సీతారామ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముక్కు శివరామ ప్రసాద్ రావు శర్మ దంపతులు చే భూమి పూజ ప్రారంభించగా, ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఏ.కార్తీక్ రావు, సర్పంచ్ కూర్మదాసు మాలిబాబు, గొంప అప్పలస్వామి, కొండ్రకోటి నరసింగరావు, వెంకట అప్పారావు, తులసి సూరి అప్పారావు, శ్రీను, భీమరాజు, తాతబాబు, ధర్మ ప్రచార కర్త సన్యాసి శెట్టి (శ్రీమన్నా రాయణ), గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌కి చేరిన జింక పిల్ల

విశాలాంధ్ర - రాజవొమ్మంగి : రాజవొమ్మంగి మండలం అప్పలరాజుపేట గ్రామ శివారున ఉన్న ప్రాథమిక పాఠశాలకు దారి తప్పిన చుక్కల జింకపిల్ల చేరింది, దింతో పాఠశాలలో పిల్లలు ఆనందంతో కేరింతలు కొట్టారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించడంతో అక్కడకు చేరిన అధికారులు జింకపిల్లను స్వాధీనం చేసుకున్నారు. అప్పటికే జింక పిల్ల కుక్కదాడిలో గాయపడినట్లు గమనించడంతో ఫారెస్ట్ అధికారులు వైద్యం అందించి సురక్షిత ప్రాంతానికి తరలించారు.

టికెట్ ఎవ్వరికి ఇచ్చిన కలిసే పనిచేద్దాం...
ఒకే తాటిపై తెలుగు తమ్ముళ్లు

విశాలాంధ్ర - దేవీపట్నం : తెలుగుదేశం పార్టీ అధిష్టానం రంపచోడవరం నియోజకవర్గం టిడిపి టికెట్ ఎవ్వరికిచ్చినా కలిసే పనిచేయాలని టీడీపీ నియోజకవర్గ స్థాయి నేతలు నొక్కి ఒక్కాలించారు. ఇటీవల రంపచోడవరం నియోజకవర్గ టికెట్ విషయంలో గత రెండు రోజులుగా నాయకులు మధ్య జరుగుతున్న కోల్డ్ వార్ పై నియోజకవర్గ నాయకులు వంతల రాజేశ్వరి శీతంశెట్టి వెంకటేశ్వర రావు రాష్ట్ర స్థాయి పార్టీ నేతలతో కలసి బుధవారం ఇందుకూరు పేట ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశం లో పార్టీ లో విభేదాలు విస్మరించి అందరూ కలసి కట్టుగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని నేతలు పిలుపునిచ్చారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో తెలుగు దేశం పార్టీ అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం అని నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర బీసీ సెల్ వైస్ ప్రెసిడెంట్ జె.ఎస్ నగేష్ రాష్ట్ర ఎస్సి సెల్ ఉపాధ్యక్షులు గోళ్ళ చంటిబాబు రాష్ట్ర రైతు కార్యదర్శి మాగాపు బాబూరావు మాజీ ఎంపిటీసి ముచ్చి వీర వెంకట సత్యనారాయణ మాజీ మండల పార్టీ అధ్యక్షులు మాగాపు బాబూరావు దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం : పోరాటాలపై ఉక్కు పాదం మోపుతున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న జరిగే సమ్మెను జయప్రదం చేయండి అని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్య రామ్ పిలుపునిచ్చారు. సమ్మె ప్రాధా న్యతను వివరిస్తూ స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో స్టీల్ వర్కర్ ను నేడు ప్లాంట్ లోని స్టోర్ జంక్షన్ వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా జె అయోధ్య రామ్ మాట్లాడుతూ నేడు రైతులు తమ పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇమ్మని గడచిన రెండు సంవత్సరాలుగా వేచి ఉన్నప్పటికీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించడానికి ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రభుత్వ విధానాలతో విసిగి చెందిన రైతులు చలో ఢిల్లీ కార్య క్రమాన్ని చేపడితే తీవ్ర నిర్బంధాన్ని ఉపయోగించి వారిని అణిచివేయాలని చూడడం దుర్మార్గమని ఆయన అన్నారు. పోరాటాలను అహాస్యం చేస్తూ కమిటీ వేసి చర్చిస్తామని చెప్పడం వల్ల ప్రభుత్వంపై నమ్మకం కోల్పోయిన రైతులు ఉద్యమానికి దిగారని ఆయన వివరించారు. ఈ ఉద్యమంలో కార్మిక కర్షక మైత్రిని ప్రతిబింబించే విధంగా సమ్మె ద్వారా ప్రభుత్వ విధానాలపై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్ మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వానికి కార్మిక సమస్యలను కార్మిక సంఘాలతో చర్చించ డానికి గడచిన ఐదు సంవత్స రాల కాలం సరిపోలేదని ఆయన ఎద్దేవా చేశారు. బిజెపి ప్రభుత్వానికి కార్మిక సమస్యల కంటే పెట్టుబడిదారులకు ఎలా ఈ ప్రభుత్వ రంగ పరిశ్రమలను అప్పజెప్పడం మీదే దృష్టి ఉందని ఆయన తీవ్రంగా విమర్శించారు. గడచిన మూడు సంవత్సరాలుగా విశాఖ స్టీల్ ప్లాంట్ 100% వ్యూహాత్మక అమ్మకానికి వ్యతిరేకంగా పోరాడుతున్న కేంద్ర ప్రభుత్వంలో చలనం లేదని ఆయన వివరించారు. ఇదే సమయంలో కార్మికుల హక్కుగా ఉన్న నూతన వేతనాలు అమలు చేయకుండా స్థానిక యాజ మాన్యం వ్యవహరించడానికి ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ఈ సమ్మె ద్వారా మనలను మనం కాపాడు కోవడం మన హక్కులను రక్షించు కోవడం కోసం జరుగుతోందని, దీనిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సీఐటీయూ ప్రతినిధులు పి శ్రీనివాసరాజు, బి.అప్పా రావు, కృష్ణమూర్తి, బి.మహేష్, శ్రీనివాసరెడ్డి, డి.సత్యనారాయణ, దురా ప్రసాద్, విడివి పూర్ణచంద్ర రావు, మధు, మురళి తదితరులతో పాటు వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు మరియు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.